క్లుప్తంగా

జోహార్ సైనికా



వంగపల్లిపేట ప్రాథమిక పాఠశాలలో మౌనం పాటిస్తున్న విద్యార్థులు

చీపురుపల్లి: కోల్‌కత్తాలో పారా గ్లైడింగ్ శిక్షణలో ప్రాణాలు విడిచిన నేవీ మెరైన్ కమాండో చందక గోవింద్ మృతికి వంగపల్లిపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. ఉపాధ్యాయుడు ఎస్.బలరాం నేతృత్వంలో చందక గోవింద్ సంతాప సభ శనివారం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఉపాధ్యాయుడు బలరాం మాట్లాడుతూ దేశ రక్షణ కోసం శిక్షణ పొందుతూ ప్రాణాలు కోల్పోయిన చందక గోవింద్ ఆదర్శప్రాయుడన్నారు.

తుంపర సేద్యంతో నీటి ఆదా



తుంపర సేద్యం పరికరాలను పరిశీలిస్తున్న ఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ

గంట్యాడ: తుంపర సేద్యంతో నీటి వృథాను అరికట్టవచ్చని ఏపీ ఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని బోనంగి గ్రామంలో రైతులకు ప్రభుత్వం రాయితీపై అందించిన తుంపర సేద్యం పరికరాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తుంపర సేద్యం పరికరాలను 50 శాతం రాయితీతో అందిస్తున్నామన్నారు. తుంపర సేద్యం వల్ల మొక్క ఎదుగుదల బాగుంటుందని తెలిపారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ సందర్శన



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

జామి: స్థానిక పోలీస్ స్టేషన్‌ను విజయనగరం డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు శనివారం సందర్శించారు.ముందుగా స్టేషన్ పరిసరాల ను పరిశీలించారు. అనంతరం ఎఫ్ఐఆర్‌లు, పెండింగ్ కేసులు, కేస్ డైరీ తదితర రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని, మండలంలో ఎక్కడా శాంతి భద్రతల సమస్ తలెత్తకుండా చూడాలని ఎస్ఐ వీరబాబు, సిబ్బందికి సూచించారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోండి

బొండపల్లి: ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వడదెబ్బకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బొండపల్లి, దేవుపల్లి పీహెచ్‌సీల వైద్యాధికారులు అమృతవల్లి, సత్యవతి శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారు ఉదయం పది గంటల లోపు పనులను ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. అత్యవసరం అయితే తప్ప 10 గంటల తర్వాత బయటకు రావద్దని తెలిపారు. ఎక్కువగా మజ్జిగ, కొబ్బరి నీళ్లు తాగాలని, బయటకు వచ్చినప్పుడు ఎండ నుంచి రక్షణకు వెంట గొడుగు తీసుకు వెళ్లాలని, టోపీలు, తెలుపు రంగు దుస్తులు ధరించాలని సూచించారు.

పోగొట్టుకున్న ల్యాప్‌టాప్ అందజేత

విజయనగరం టౌన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు మరిచిపోయిన ల్యాప్‌టాప్‌ను కండక్టర్, ఆర్టీసీ అధికారులు సదరు వ్యక్తికి అందజేశారు. విజయనగరం నుంచి అలమండ వెళ్లే బస్సులో ప్రయాణిస్తున్న సతీష్ బస్సు దిగిన సమయంలో ల్యాప్‌టాప్‌తో ఉన్న బ్యాగును బస్సులో మరిచిపోయాడు. కండక్టర్ ఆ బ్యాగును గుర్తించి ఆర్టీసీ అధికారులకు అందజేశారు. బ్యాగ్‌లో ఉన్న ఐడీ కార్డు ఆధారంగా ప్రయాణికుడి వివరాలు తెలుసుకుని అతనికి సమాచారం ఇవ్వడంతో అతను డిపోకు వచ్చి బ్యాగును తీసుకున్నాడు. పోగొట్టుకున్న ల్యాప్‌టాప్‌ను అందించినందుకు ఆర్టీసీ ట్రాఫిక్ కంట్రోలర్ ఆదినారాయణ, దుర్యోధన, డ్రైవర్ వర్మ, కండక్టర్ సీహెచ్ సత్యంకు కృతజ్ఞతలు తెలిపాడు.

స్వాతంత్ర్య సమరయోధులకు నివాళి

విజయనగరం రూరల్: మండలంలోని గుండాలపేట ప్రాథమిక పాఠశాలలో తమన్నా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు మంగళ్‌సింగ్ పాండే, వందేమాతరం గేయ రచయిత బంకిమ్ చంద్రచటర్జీ జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు ఫౌండేషన్ అధ్యక్షుడు బి.రామకృష్ణారావు, హెచ్ఎం ఎ.నాగరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో వారి పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు వారిని స్ఫూర్తిగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలని సూచించారు.

చంద్రబాబుది ఓర్వలేనితనం

- చంద్రబాబు మాయమాటలు నమ్మవద్దు
- ఆసరా సంబరాల్లో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

మెరకముడిదాం: ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పాలన చూసి చంద్రబాబునాయుడు ఓర్వలేకపోతున్నారని రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలను వెలుగు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. అతిథులుగా మంత్రి బొత్స, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి బొత్స మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ప్రజలకు మళ్లీ మోసపూరిత మాటలు చెప్పి అధికారం చేజిక్కించుకోవాలని చూస్తున్నాడని, ఆయన మాయమాటలు నమ్మవద్దని మహిళలకు సూచించారు. ప్రతిపక్షనేతగా జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసిన సమయంలో ఇచ్చిన హామీలనే కాకుండా మరిన్ని సంక్షేమపథకాలను ప్రజలకు అందజేశారన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఈ స్థాయిలో పథకాలు అమలు చేయడంలేదని, మన రాష్ట్రంలో గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో అమలయ్యేవని, మళ్లీ ఇప్పుడు ఆయన కుమారుడు జగన్ ఆ స్థాయిలో పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. పేదలకు మేలు జరుగుతుంటే చూసి ఓర్వలేక చంద్రబాబునాయుడు అవాకులు, చవాకులు మాట్లాడుతున్నారని, తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అమ్మ ఒడి, చేయూత, చేదోడు, నాడు-నేడు వంటి పథకాలను ఎందుకు అమలు చేయలేకపోయాడని ప్రశ్నించారు. తాను చేయలేనిది జగన్‌మోహన్‌రెడ్డి చేస్తుంటే చూసి ఓర్వలేక బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మెరకముడిదాం మండలానికి చెందిన డ్వాక్రా సంఘాల సభ్యుల ఖాతాల్లో వైఎస్సార్‌ఆసరా పథకం మూడో విడతగా రూ.10.39 కోట్లు జమచేస్తున్నామని చెప్పారు. అనంతరం ఆయన మహిళలతో నేరుగా మాట్లాడుతూ మీకు పింఛన్, ఇతర పథకాలు ఇచ్చినప్పుడు వలంటీర్లకు కానీ ఇంకెవరికైనా లంచం ఇస్తున్నారా అని ప్రశ్నించగా... తాము ఎలాంటి లంచం ఇవ్వడం లేదని మహిళలు చెప్పారు. జెడ్పీచైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేస్తానని చెప్పి 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు, ఆ హామీని అమలు చేయకుండా మహిళలను మోసం చేశారని గుర్తుచేశారు. జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం పాదయాత్రలో ఇచ్చినమాట ప్రకారం 2019 ఎన్నికల నాటికి డ్వాక్రా మహిళలకు బ్యాంకుల్లో ఉన్న రుణాల మొత్తాన్ని నాలుగు విడతల్లో చెల్లిస్తున్నారని, ఇప్పటికే మూడు విడతల నిధులు విడుదల చేశారని చెప్పారు.ఎన్నికలు ఎప్పుడు వచ్చినా జగనన్నకు ప్రజలంతా మద్దతుగా నిలవాలని కోరారు. ఎంపీ బెల్లాన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల ఆశాజ్యోతి అని అన్నారు. అనంతరం మహిళలకు మంత్రి, జెడ్పీ చైర్మన్, ఎంపీ చెక్కు, వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా పలు పాఠశాలల విద్యార్థులకు కళ్లద్దాలు అందజేశారు. జేసీ మయూర్ అశోక్‌కుమార్, ఎంపీడీఓ పి.రామకృష్ణ, తహసీల్దార్ బి.రత్నకుమార్, ఏపీఎం కె.మహేశ్వరరావు, ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు ,కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, బూర్లె నరేష్‌కుమార్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.



మహిళలకు చెక్కు అందజేస్తున్న మంత్రి బొత్స, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన



సభలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ఉపకరణాల ఎంపికకు గుర్తింపు శిబిరం రేపు

శృంగవరపుకోట/వేపాడ: ఎస్.కోట మండలంలోని ధర్మవరం ఉన్నత పాఠశాలలో ఈనెల 10న విభిన్న ప్రతిభా వంతులకు ఉపకరణాల పంపిణీకి సంబంధించిన గుర్తింపు శిబిరం నిర్వహించనున్నట్లు ఎస్.కోట, వేపాడ ఎంపీడీఓలు శేషుబాబు, బి.ఎస్.ఎన్.కె.పట్నాయక్ శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సచివాలయాల కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు తమ పరిధిలో ఉన్న విభిన్న ప్రతిభా వంతులకు సమాచారం అందించాలని సూచించారు. మూడు చక్రాల సైకిళ్లు, వీల్‌చైర్లు, చంకకర్రలు, కృత్రిమ కాళ్లు, కాలిఫర్స్, రోలేటర్స్, వినికిడి మిషన్లు, వాకింగ్ స్టిక్స్, మానసిక ప్రతిభావంత పిల్లలకు ఎంఎస్ఐఈడీ కిట్లు, సీపీ చైర్, బ్యాటరీ ఆపరేటెడ్ మూడు చక్రాల సైకిళ్లను అందించేందుకు ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శిబిరానికి హాజరయ్యే విభిన్న ప్రతిభావంతులు సదరన్ సర్టిఫికెట్, ఆదాయ ధృవపత్రం, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని రావాలని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు ఈ శిబిరానికి హాజరయ్యేలా చూడాలని గ్రామసచివాలయ సిబ్బంది, వలంటీర్లను కోరారు. గత మూడేళ్ల లోపు పరికరాలు పొందిన విభిన్న ప్రతిభావంతులు అనర్హులని పేర్కొన్నారు.

రన్ ఫర్ జీసస్



చీపురుపల్లి: ర్యాలీలో గీతాలు ఆలపిస్తున్న క్రైస్తవులు

చీపురుపల్లి: పట్టణానికి చెందిన ఆంధ్రాబాప్టిస్ట్ చర్చి ఫాస్టర్ జి.ధర్మారావు నేతృత్వంలో ఆదివారం ఈస్టర్ పండగ నేపథ్యంలో క్రైస్తవులతో కలిసి రన్ ఫర్ జీసస్ కార్యక్రమం శనివారం సాయంత్రం నిర్వహించారు. ఆంధ్రాబాప్టిస్ట్ చర్చి నుంచి లావేరురోడ్, మూడు రోడ్ల జంక్షన్, మెయిన్‌రోడ్‌లో ఈ ర్యాలీ కొనసాగింది.



కొత్తవలస: ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

కొత్తవలసలో...

కొత్తవలస: మండలంలోని పలు చర్చిల పాస్టర్స్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం రన్ ఫర్ జీసస్ సువార్త ర్యాలీ నిర్వహించారు. ఫాదర్ డేనియల్ మాట్లాడుతూ ఏసు ప్రభువుకు గుడ్‌ఫ్రైడే నాడు శిలువ వేస్తే ఈస్టర్ సండే నాడు మళ్లీ పునర్జన్మ ఎత్తారని తెలిపారు. క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

70 మందిపై బైండోవర్

గజపతినగరం: ఎలాంటి లైసెన్స్ లేకుండా చిట్టీలు నిర్వహిస్తున్న వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని స్థానిక సీఐ ఎల్. అప్పలనాయుడు హెచ్చరించా రు. గజపతినగరం మండలంలో చిట్టీలు నిర్వహిస్తున్నవారితో స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం ఆయన సమావేశమయ్యారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా చిట్టీలు ఎత్తుబడి చేసిన వారిపై చర్యలు తప్పవని అన్నారు. అలాగే లైసెన్స్ లేని వారి వద్ద చిట్టీలు కట్టడం ప్రజలు తక్షణమే మానుకోవాలని సీఐ సూచించారు. మండలంలో అనుమతులు లేకుంగా చిట్టీలు కట్టించుకుంటున్న 70మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని చెప్పారు. ఇకపైన చిట్టీల నిర్వహణ పూర్తిగా మానుకోవాలని, లేకుంటే అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేస్తామని అన్నారు. స్థానిక ఎస్ఐ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ అప్పలనాయుడు

నవధాన్యాల సాగుతో భూసారం



కుమ్మపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

వేపాడ: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం మండల యాంకర్ సన్యాసమ్మ తెలిపారు.మండలంలోని కుమ్మపల్లి యూనిట్‌లో రైతులకు నవధాన్యాల సాగు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ ప్రధాన పంట సాగు చేసే ముందు పొలాల్లో 20 నుంచి 30 రకాల నవధాన్యాల విత్తనాలను చల్లి, 45 రోజుల తర్వాత చేనును భూమిలో కలియదున్నాలని చెప్పారు. ఇలా చేయడం వల్ల నేలలో నత్రజని, భాస్వరం, పొటాషియంతోపాటు సూక్ష్మపోషకాలు, జింక్, బోరాన్,మాంగనీస్ లాంటి 18 పోషకాలు భూమికి లభిస్తాయన్నారు. నేల గుల్లబారి మృదువుగా తయారవుతుందని, ప్రధాన పంటకు కలుపు సమస్య ఉండదని తెలిపారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందేందుకు రైతులంతా ప్రకృతి వ్యవసాయం చేయాలని కోరారు. ఎన్‌పీఎం దుకాణాల్లో, రైతుభరోసా కేంద్రాల్లో నవధాన్యాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఐసీఆర్పీలు వెంకటరావు, రమణమ్మ, నాయుడు ఈశ్వరరావు పాల్గొన్నారు.

పథకాలకు అర్హతే ప్రామాణికం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం రూరల్: అర్హతే ప్రామాణికంగా పార్టీలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మె ల్యే బొత్స అప్పలనరసయ్య తెలిపారు. మండలంలోని పాతబగ్గాం సచివాలయం పరిధి భూదేవిపేట గ్రామంలో శనివా రం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను ఆరా తీశారు. స్థానికులు ఆయన దృష్టికి పలు సమస్యలు తీసుకు రాగా..వాటిని పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామసచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా పథకాలను ఇళ్ల వద్దకే అందిస్తున్నామని, లంచాలు, అవినీతికి తావులేని పారదర్శక పాలన తీసుకొచ్చామన్నారు. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలు ఉన్న వారు ఆస్పత్రికి వెళ్లే పనిలేకుండా ఇంటివద్దకే ఫ్యామిలీ డాక్టర్ పేరుతో వైద్యులను పంపించి మెరుగైన వైద్యం అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి సీఎం సమప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. సర్పంచ్ కనకల సుబ్రహ్మణ్యం, జెడ్పీటీసీ గార తవుడు, ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, పీఏసీఎస్ చైర్మన్ కరణం ఆదినారాయణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ సుదర్శన్, తహసీల్దార్ అరుణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బూడి వెంకటరావు, పార్టీ నాయకులు మండల సురేష్, బెల్లాన త్రినాథరావు,సామంతులు పైడిరాజు పాల్గొన్నారు.



పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

వేసవి అలవెన్స్‌లు ఇవ్వాలి

లక్కవరపుకోట : ఉపాధి హామీ వేతనదారులకు వేసవి అలవెన్సులు అందజేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఎస్.కోట నియోజకవర్గ నాయకుడు డేగల అప్పలరాజు డిమాండ్ చేశారు. రంగరాయపురం గ్రామంలో వేతనదారులతో కలిసి శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత నేపథ్యంలో ఉపాధి పనులను ఒంటిపూటే నిర్వహించాలని, గిట్టుబాటు వేతనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే తాగునీరు, మజ్జిగకు ప్రత్యేక అలవెన్సులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

రేపటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామంలో రాజరాజేశ్వరీదేవి ఆలయ వార్షికోత్సవాలు ఈనెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు దూసి శ్రీధర్ శర్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తేదీన శివపార్వతుల శాంతి కల్యాణం, 11న ప్రత్యేక పూజలతో పాటు మధ్యాహ్నం అన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం



జెడ్పీ చైర్మన్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

విజయనగరం:

సకల విఘ్నాలను తొలగించే సంపత్ వినాయకుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. నగరంలోని కొత్తపేటలో మండపం వీధిలో ఉన్న సంపత్ వినాయక ఆలయం ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం అర్చకులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఆయన వెంట ఆలయ నిర్మాణకర్త ఎడ్ల పైడిరాజు, పలాస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు కె.వి. సూర్యనారాయణరాజు, యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి అవనాపు విక్రమ్ తదితరులు ఉన్నారు.

సంక్షేమ సారథి జగన్‌ను ఆశీర్వదించండి

- 'జగనన్నే మా భవిష్యత్'లో ఎంపీ బెల్లాన, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీలోని వంగపల్లిపేట, రామాంజనేయ కాలనీ, విజయాకాలనీ, లావేరురోడ్ తదితర ప్రాంతాల్లో ఎంపీ బెల్లాన, మెరకముడిదాం మండలంలోని గొట్టుపల్లి గ్రామంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు వేర్వేరుగా 'జగనన్నే మా భవిష్యత్', 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు, పార్టీ నాయకులతో కలిసి శనివారం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని వివరించారు. సీఎం జగన్ సందేశాన్ని వినిపించారు. పథకాలు వస్తున్నాయా, లేదా అడిగి తెలుసుకున్నారు. పథకాల కోసం ఎవరికైనా లంచాలు ఇవ్వాల్సి వచ్చిందా అని లబ్ధిదారులను ప్రశ్నించారు. ఒక్క రూపాయి కూడా లంచం ఇవ్వకుండానే పథకాలు అందుతున్నాయని లబ్ధిదారులు బదులిచ్చారు. అనంతరం లబ్ధిదారుల అనుమతితో వారి ఇళ్లకు 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను అతికించారు. ఎంపీ, జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పార్టీలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున ఘనత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. అర్హత ఉండి ఇంకా ఎవరికైనా సాంకేతిక సమస్య కారణంగా పథకాలు రాకపోతే తక్షణమే వలంటీర్లు ద్వారా సచివాలయాలను సంప్రదించాలని సూచించారు. అలాగే వేపాడ, గుర్ల, గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు, చీపురుపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో పార్టీ నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం నిర్వహించారు.

– చీపురుపల్లి, మెరకముడిదాం, వేపాడ, గుర్ల, గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు, చీపురుపల్లిరూరల్



చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణంలోని విజయాకాలనీలో లబ్ధిదారుల అనుమతితో ఇళ్లకు స్టిక్కర్లు అతికిస్తున్న ఎంపీ చంద్రశేఖర్



వేపాడ: నీలకంఠరాజపురంలో పథకాలపై సర్వే చేస్తున్న డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు, ఏఎంసీ చైర్‌పర్సన్ కస్తూరి



మెరకముడిదాం: గొట్టుపల్లిలో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్‌ను ఇంటికి అతికిస్తున్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసరావు



బొండపల్లి: గొట్లాంలో లబ్ధిదారు ఇంటి గోడపై స్టిక్కర్ అతికిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ రమణ



బొండపల్లి: నెలివాడలో పథకాలను వివరిస్తున్న ఎంపీపీ చలం నాయుడు, నాయకులు



వేపాడ: సోంపురంలో పథకాలను వివరిస్తున్న నాయకులు



గుర్ల: లవిడాంలో పథకాలను వివరిస్తున్న సచివాలయ కన్వీనర్ అప్పలస్వామి



గజపతినగరం రూరల్: బంగారమ్మపేటలో ప్రభుత్వ పనితీరుపై సర్వే చేస్తున్న గృహ సారథులు, నాయకులు



దత్తిరాజేరు: గుచ్చిమిలో గృహ సారథులతో కలిసి సర్వే చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రమేష్‌నాయుడు



చీపురుపల్లిరూరల్: పర్లలో జగనన్నే మా భవిష్యత్ బుక్‌లెట్ అందజేస్తున్న జెడ్పీటీసీ శిరీష, నాయకులు



చీపురుపల్లిరూరల్: పుర్రేయవలసలో పథకాలను వివరిస్తున్న నాయకులు అనంతం, రాజారావు తదితరులు